# దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

శుక్రవారం 6 06 2025

సంపుటి 1 సంచిక 38

UDYAM / TS-09-0148996



AURA
THE SCHOOL
NURSERY TO V CLASS E/M
Recognized By The Government Of Telangana (Reg No: 307/A1/2025)
Suryavamshi Gardens, Laxma Reddy Palem, Abdullapurmet(m), R.R (Dist), T.S-501505.
ADMISSION OPEN
9160980670 / 76




## డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

**దశ, హైదరాబాద్:** ఇటీవల రాజేంద్రనగర్ పిఎస్‌లో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటనను జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి) సుమోటోగా తీసుకుంది. దీంతో రాష్ట్ర డిజిపి జితేందర్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు ఇచ్చింది. గత నెల 13 రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వేధింపుల వల్లే మరణించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో మీడియాలో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి.. గురువారం రాష్ట్ర డిజిపికి నోటీసులు ఇచ్చింది. ఆటో డ్రైవర్ మృతిపై రెండు వారాల్లో విచారణ చేసి పూర్తి నివేదికను ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది.



## మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

**దశ, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి క్రిటికల్ గా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. గుండె సమస్యతో బాధ పడుతున్న ఆయన.. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం సీరియస్ గా ఉన్నట్లు సమాచారం.




# ప్రాణాలు తీస్తున్న తొందర...

## తొక్కిసలాటల్లో 182 మంది మృతి

దేశంలో గత ఏడాది కాలంలో జరిగిన పలు తొక్కిసలాట ఘటనల్లో ఇప్పటివరకు 182 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గాయాలపాలయ్యారు. తాజాగా చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో ఇప్పటిదాకా 11 మంది మృతి చెందారు. గతేడాది ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా సందర్భంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన దగ్గరి నుంచి తాజాగా జరిగిన బెంగళూరు ఘటన వరకు దశ ప్రత్యేక కథనం...

..2వ పేజీలో →

# మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధం

### వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల

### రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు

### 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు

**దశ, హైదరాబాద్**

మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కొత్త మున్సిపాలిటీలలో వార్డుల విభజనకు కసరత్తు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు, 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం అయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వార్డుల విభజన ప్రక్రియకు మున్సిపల్ శాఖ అధికారి శ్రీదేవి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు.

**త్వరలో రిజర్వేషన్‌లు ఖరారు:**



ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితాను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల మున్సిపల్, ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి.

**పునర్విభజన ఇలా:**

కొహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డులు ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని భావిస్తోంది.

## రసూల్ పుర ఫ్లైఓవర్ కు భూసేకరణ పూర్తి చేయండి

### కమీషనర్ ఆర్ వి కర్ణన్

**దశ, హైదరాబాద్:** రసూల్ పుర ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో గురువారం కమిషనర్ సికింద్రాబాద్ జోన్ లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బస్ స్టాప్‌లను పరిశీలించారు. రైల్వే సరిహద్దు నుండి 24 మీటర్ల వరకు భూమి అవసరం ఉందని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. బస్ స్టాప్‌కు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి దానిని తరలించాల్సిన అవసరం ఉందని ప్రాజెక్ట్ ఎస్.ఇ. శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ హెచ్ సిటీ ద్వారా రసూల్‌పుర వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని వెంటనే పరిశీలించి భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.




## ప్రభుత్వ ఆసుపత్రిలో వంద డెలివరీలు చేయాలి

### జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్




**దశ, జగిత్యాల:** జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో జూన్ మాసంలో 100 డెలివరీలు అయ్యేలా కృషి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం కోరుట్ల ఏరియా హాస్పిటల్ లో కథలాపూర్ ,అంభారీ పేట ఓల్డ్,అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర లలోని వైద్యాధికారులు ,సూపర్వైజర్లకు,ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీలు డెలివరీలు ఎక్కువగా అయ్యేలా ప్రోత్సహించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోరుట్ల ఏరియా హాస్పిటల్ లో నలుగురు గైనకాలజిస్టులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి ,కోరుట్ల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు సూపర్వైజర్లు తులసి వెంకటరమణ, ధనంజయ , భూషణ్, శ్రీధర్, ఉదయ ప్రసాద్,ఏ.ఎన్.ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుకి భూమి ఒక నమ్మకం


### భూ భారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ తేజస్‌నంద్



దశ , సూర్యాపేట : భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లాలోని టేకుమట్ల రెవెన్యూ గ్రామంలో రైతు వేదికలో జరిగిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు . రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధించిన సమస్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డేస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుకి భూమి ఒక నమ్మకమని గతంలో జరిగిన తప్పులను సవరించుటకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని జూన్ 3 తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరించి భూ భారత్ చట్టంలో పొందుపరిచిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనైర్దేశం చేశామని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈరోజు టేకుమట్లలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 59 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. తన సమస్యపై వచ్చిన పబ్బు శివయ్యకు కలెక్టర్ దరఖాస్తు స్వీకరించి రసీదు అందజేశారు. ప్రతి రైతు దరఖాస్తులను అందజేసి రసీదు పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో తాసిల్దార్ కృష్ణయ్య ఆర్ ఐ గోపి ఆపరేటర్ సందీప్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో వారి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటె కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, జిల్లా అదనపు కలెక్టర్ రేవెన్యు పి.రాంబాబు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.

## వైద్య సేవలు మెరుగు పరచాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్ సత్యప్రసాద్



**దశ , జగిత్యాల:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో వైద్య సేవలు మరింత మెరుగు పరచాలని,అదేవిధంగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ జి.సత్యప్రసాద్ ఆదేశించారు.గురువారం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ ల్లో భాగంగా ఓ.పి సేవలు, ఐ.పీ సేవలు,ఆసుపత్రిలోని రికార్డ్స్, ల్యాబ్ రికార్డ్స్, ఐపీ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి లను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు గా డెంగ్యూ ,వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.కాలపరిమితి దాటిన మెడిసిన్ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్,మాత శిశు సంరక్షణ అధికారి ముస్కు మహిపాల్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..





## పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

❖ *పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ కమిషనర్ ఎస్. రవీందర్‌రెడ్డి*

**దశ ,అబ్దుల్లాపూర్‌మెట్ :** పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివార ణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కమిషనర్ ఎస్. రవీందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో 100 రోజులు ప్రణాళిక అమలులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద అంబర్‌పేట్ ఈదుల చెరువు కట్టపై ఇరువైపులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కిరణ్, సుమంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## క్రైమ్ కార్నర్

### కారు, బైకు ఢీ..ముగ్గురికి తీవ్ర గాయాలు



**దశ, నల్గొండ:** శాలిగౌరారం మండలం పెరిక కొండారం గ్రామ చివరలో హైవే పై రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి అర్వపల్లి సైడ్ వెళుతున్న కారు. అరవపల్లి నుండి నకిరేకల్ వైపు వస్తున్న పల్సర్ బైక్ను కారు రాంగ్ రూట్లో వెళ్లి ఢీకొట్టింది. ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులతో పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సహాయంతో ఆసుపత్రులకు తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో పెళ్లికొడుకుకు తీవ్ర గాయాలు



**దశ, జగిత్యాల:** కొండగట్టు వద్ద పెళ్లి బృందం కారును డీ సీ ఏం వ్యాను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న పెళ్లి కొడుకు మహేష్ తో పాటు ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో రుద్ర (3) చిన్నారి మృతి చెందింది. గాయపడ్డ వారిని జగిత్యాల ఆస్పత్రి కి తరలించారు. మహారాష్ట్ర నాందేడ్ నుండి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కు పెళ్లి బృందం బయలుదేరింది. గురువారం పెళ్లి జరుగాల్సి ఉంది. రోడ్డు ప్రమాదంతో పెళ్ళంట విషాదం నెలకొంది.

### ఖమ్మంలో ఘోర యాక్సిడెంట్; తండ్రి కొడుకుల మృతి

**దశ, ఖమ్మం:** కాలేజీలో అడ్మిషన్ కోసం వెళుతుండగా జరిగిన యాక్సిడెంట్లో తండ్రి కొడుకులు మృతి చెందారు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన బాల్య (50), అతడి కుమారుడు సాయికుమార్ ఓ ఇంటర్ కాలేజీలో చేర్పించేందుకు ఖమ్మం వచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ క్రాస్ చేస్తుండగా ఓ లారీ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. ఇద్దరు లారీ టైర్లకింద పడి మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

❖ *అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన*



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి చెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, శంకరంపేట మండల రుద్రారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి (40) టీఎస్-08-యూజే-9940 డీసీఎం క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మెదక్ జిల్లా శంకరంపేట నుంచి దాణాలోడుతో డీసీఎం ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బయలుదేరింది. మార్గమధ్యలోకి రాగానే ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెంబర్ -11 దాటిన తరువాత సుమారు రాత్రి 08:30 సమయంలో డీసీఎం డ్రైవర్ నునావత్ గణేష్ ఓవర్ టెక్ చేసే సమయంలో ఓఆర్ఆర్‌పై నిర్లక్ష్యంగా ఆపి ఉన్న టీఎస్ -12-యూజీ-0576 టస్కర్ వెహికల్ వెనుక భాగంలో టస్కర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టంది. దీంతో ఎడమవైపు కూర్చొని ఉన్న యాదగిరికి బలమైన గాయాలు అయ్యి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నామని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ వి. అశోక్‌రెడ్డి తెలిపారు.

# ప్రాణాలు తీస్తున్న తొందర..!

**దశ, హైదరాబాద్:** ఐపీఎల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలవాలని దేశవ్యాప్తంగా 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కోట్లాది మంది ఫ్యాన్స్ ఆశలు నెరవేరుస్తూ.. మంగళవారం ఆర్సీబీ పంజాబ్‌పై జయభేరి మోగించి.. కప్‌ను ముద్దాడింది. ఈ నేపథ్యంలోనే ఆర్సీబీ జట్టుకు బెంగళూరులో ఘన సన్మానం చేశారు. అయితే ఆర్సీబీ విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ ఘటనలో ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే దేశంలో గత ఏడాది కాలంగా జరిగిన 6 తొక్కిసలాట ఘటనల్లో 182 మంది మృతి చెందారు. మరికొన్ని వందల మంది గాయాల పాలయ్యారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో 18 మంది, మహా కుంభమేళాలో 30 మంది, గోవా ఆలయంలో ఆరుగురు, తిరుపతిలో ఆరుగురు, హైదరాబాద్ సంధ్యా థియేటర్ వద్ద ఒకరు, హత్రాస్ సత్సంగ్ 121 మంది ప్రాణాలు కోల్పోయారు.



### న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట

ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీన దేశ రాజధానిలోని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో 11 మంది మహిళలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాకు వెళ్లేందుకు రైళ్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు.. ఒక్కసారిగా గందరగోళానికి గురై పరుగులు తీయడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది.

స్టేషన్‌లోని 14, 15 ప్లాట్‌ఫారాలను కలిపే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై కొంతమంది ప్రయాణికులు జారిపడటంతో ఈ విషాదం జరిగింది. రైలు బయలుదేరడంలో ఆలస్యం, ప్రతి గంటకు 1500 జనరల్ టికెట్ల విక్రయించడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా రైలు ప్లాట్‌ఫారాలు మారినట్లు తప్పుడు ప్రకటనలు రావడం ప్రయాణికుల్లో గందరగోళం సృష్టించడంతో.. అది ఈ తొక్కిసలాటకు దారితీసినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

### ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తొక్కిసలాట

144 ఏళ్లకోసారి జరిగే మహా కుంభమేళా సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో కనీసం 30 మంది మరణించగా.. 60 మంది గాయపడ్డారు. జనవరి 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా అమృత్ స్నానం చేసేందుకు కోట్లాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది.

### గోవా ఆలయంలో తొక్కిసలాట

ఉత్తర గోవాలోని షిర్‌గావ్‌లో జరిగిన వార్షిక లైరై దేవి జాతర (ఊరేగింపు)లో తొక్కిసలాట జరగడంతో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని పనాజి నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీ దేవి లైరై ఆలయం వద్ద ఈ వార్షిక ఉత్సవం నిర్వహించగా..

దాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అధిక రద్దీ, సరిపడా భద్రతా బలగాలు లేకపోవడం గందరగోళానికి దారితీసి తొక్కిసలాటకు కారణమైందని వార్తలు వెలువడ్డాయి.

### తిరుపతి తొక్కిసలాట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల టోకెన్ల పంపిణీ సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు విడిచారు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద వైకుంఠ ద్వార సర్వదర్శనం, భక్తుల కోసం ప్రత్యేక దర్శనం, టోకెన్ల పంపిణీ సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. 10 రోజుల పండుగ కోసం దర్శనం టోకెన్లను జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి పంపిణీ చేయాల్సి ఉండగా.. అర్ధరాత్రి నుంచే కౌంటర్ల వద్ద వేలాది మంది భక్తులు చేరుకున్నారు. దీంతో టికెట్ కౌంటర్ల వద్ద తీవ్ర గందరగోళం చెలరేగడంతో తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. క్యూ లైన్లలో ఉన్న ఒక మహిళకు ఆరోగ్యం బాగోలేదని సహాయం చేయడానికి గేటు తెరవగా.. భక్తుల గుంపు మొత్తం ఒకేసారి ముందుకు దూసుకురావడంతో గందరగోళం చెలరేగినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

### సంధ్యా థియేటర్ తొక్కిసలాట

గతేడాది డిసెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్న సంధ్యా థియేటర్‌లో పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుంది. హీరో అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్ వద్ద గుమిగూడటంతో మెయిన్ గేటు విరిగిపోయింది. ప్రేక్షకులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో 35 ఏళ్ల మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె 9 ఏళ్ల కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అతడ్ని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. ఇటీవలె డాక్టర్లు డిశ్చార్జ్ చేశారు.

### హత్రాస్ సత్సంగ్ తొక్కిసలాట

గతేడాది జూలైలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఉన్న భోలే బాబా అని పిలువబడే నారాయణ్ సాకర్ హరి సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాట పైన చెప్పిన అన్ని ఘటనల కంటే చాలా పెద్దది. ఈ సత్సంగ్‌లో భారీగా భక్తులు గుమిగూడినపుడు తీవ్ర గందరగోళం చెలరేగింది. దీంతో తొక్కిసలాట జరగ్గా.. అక్కడ 121 మంది మరణించారు. సత్సంగ్ నిర్వాహకులు 80 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా.. అంచనాలకు మించి ఏకంగా 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

### సింహాచలంతొక్కిసలాట

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి జరిగింది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. తెల్లవారుజామున సింహాచలంలో 3:30 గంటలకు ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షం కురిసింది.దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ కౌంటర్ వద్ద ఇటీవల నిర్మించిన గోడ కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మరోవైపు భారీ ఈదురుగాలుల ధాటికి రేకులు, ఐరన్ పైపులు పడడంతో గోడ కూలిపోయింది. మహిళ ఆర్తనాదాలతో ఆలయ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో 'జాగృతి' విజేత

❖ *ప్రథమ, తృతీయ బహుమతులు అందుకున్న జాగృతి ఎన్జీవో సంస్థ ప్రదర్శించిన నాటకాలు*



**దశ, ఎల్బీనగర్ :** తెలంగాణా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ పోటీల్లో జాగృతి అభ్యుదయ సంఘం రాష్ట్రస్థాయి ప్రథమ, తృతీయ బహుమతులను రాష్ట్ర పర్యావరణ అటవీశాఖ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అందజేశారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల కాలుష్యం నియంత్రణ ఆవశ్యకతపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల నాటికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాటికల విభాగంలో వనస్థలిపురం జాగృతి అభ్యుదయ సంఘం గ్రీన్ సోల్జర్స్ ప్రదర్శించిన "గంగా" నాటికకు ప్రథమ, తృతీయ బహుమతులు గెలుచుకుంది. కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయం సనత్ నగర్ లో గురువారం బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి ఛైర్మన్ భావన ,శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై తమ మీద మరింత బాధ్యతలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదిమ్, టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి కుమార్, సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్, సీడబ్ల్యూసీ మాజీ చైర్ పర్సన్ శ్యామల దేవి, దారుణ్య, బాలజ్యోతి, బహుమతులు అందుకున్న నటీనటులు జీవన, అనూష, మణికంఠ, చంద్రశేఖర్,సిద్ధిక్ష అక్షిత, మహాలక్ష్మి, నిహారిక, శ్రద్ధ, సాయి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



## 'ఆరా ది స్కూల్' ప్రారంభం

**దశ, పెద్ద అంబర్పేట: చిన్నారులకు చిన్నతనం నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు అయిన పాఠశాల ఔరా ది స్కూల్ అని డైరెక్టర్ శివరామకృష్ణ , తేజ గుణ స్పష్టం చేశారు . పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం సూర్యవంశీ కాలనీలో గురువారం పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడారు . విద్యార్థులకు ఎటువంటి విద్యను అందించాలో తమకు స్పష్టమైన టార్గెట్ ఉందని అన్నారు . చిన్నతనం నుంచి నాణ్యమైన విద్య ప్రాక్టికల్ గా చూపిస్తూ చిన్నారులకు తెలిసేలా ఆట బొమ్మల ద్వారా వివరిస్తామన్నారు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ఔరా స్కూల్ ఎంపిక చేసుకోవడం ఉత్తమమైనదిగా భావిస్తామన్నారు.**

## రెవెన్యూ సదస్సులో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన

❖ *ఎమ్మెల్యే రంగారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి*



**దశ, ఇబ్రహీంపట్నం :** రెవిన్యూ సదస్సులో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మంచాల మండలం తాళ్లపల్లిగూడ గ్రామంలో నిర్వహించిన ఈ రెవెన్యూ సదస్సుకు ముఖ్య అథితులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. తాళ్లపల్లిగూడ గ్రామంలో సర్వేనెంబర్ 84లో ప్రభుత్వ భూమిలోని పట్టాదారులకు జరిగిన అవకతవకలను సరి చేయించి, మొత్తం 484 ఎకరాలను త్వరలో రీసర్వే చేయించి, ఎవరైతే కబ్జాలో ఉంటారో వారికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం తహసిల్దార్ ప్రసాదరావు మాట్లాడుతూ.. రంగాపూర్ గ్రామంలో 12, తాళ్లపల్లి గూడాలో 72 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ భూమికి సంబంధించిన పలు సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే స్వగ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. మండలంలో ఈ నెల 19వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, భూసమస్యలు ఉన్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల డిప్యూటీ తహసీల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, ఎంపీడీవో బాల శంకర్, విఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

❖ *అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి*

**దశ ,అబ్దుల్లాపూర్‌మెట్ :** భూ సమస్యలను శాశ్వత పరిష్కారం కోసంరాష్ట్రప్రభుత్వంప్రతిష్టాత్మకంగాభూభారతిచట్టాన్నిఅమలు చేస్తుంది. అందులో భాగంగానే నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి రైతులకు సూచించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం తట్టిఅన్నారం, మర్రిపల్లిలో గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను పరిశీలించారు.

సానుకూలంగా ఉన్న సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు వినియోగించుకొని భూ సమస్యలను పరిష్కారించుకోవాలని కోరారు. తట్టి అన్నారంకు సంబంధించిన దరఖాస్తులు సక్సేషన్ (విరసత్)-2, నాలా కన్వెన్షన్ -2, అప్లికేషన్ -3, మర్రిపల్లిలో పట్టా సర్టిఫికేట్లు కోసం 5 దరఖాస్తులు, డిజిటల్ పెండింగ్ 1 వచ్చాయని తెలిపారు. తట్టిఅన్నారంకు సంబంధించిన అప్లికేషన్స్ దాదాపు అసైన్డ్ భూములకు సంబంధించినవేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కార్తీక్‌రెడ్డి, ఆర్ ఐలు సర్వేయర్ జ్యోతి, రాము, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## గోహత్యలను అరికట్టాలి: జిల్లా విశ్వహిందూ పరిషత్



**దశ, జగిత్యాల:** గోహత్యలను అరికట్టాలని కోరుతూ జగిత్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక పోలీసు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి గోవులను రవాణా చేస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణమే మూసివేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, బిజెపి రాష్ట్ర నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి, జిల్లా సహా కార్యదర్శి గాజోజు సంతోష్ కుమార్, జిల్లా గోరక్ష ప్రముఖ నరేష్, భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు, వి.హెచ్.పి నగర అధ్యక్షులు జిట్ట వేణి అరుణ్ కుమార్, జగిత్యాల జిల్లా కోశాధికారి మామిడాల రాములు, లింగంపేట్ శ్రీనివాస్, భజరంగ్ దాల్ కన్వీనర్ పాదం మహేందర్,భారత్ రక్ష సమితి సభ్యులు,విశ్వహిందూ పరిషత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.